క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతాపురంకాలనీ, శ్రీనివాసానగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, కృష్ణవేణి ప్రాంతం, బందరు రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

ప్రేరణ యువజనోత్సవంలో భాగ్యశ్రీ ప్రతిభ



పెనమలూరు: విజయవాడ మైత్రాసనం ప్రేరణ యూత్ సెంటర్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భక్తి సంగీత, సాంప్రదాయ నృత్య పోటీలు నిర్వహించారు. కానూరుకు చెందిన తాల్లూరి భాగ్యశ్రీ భరతనాట్యం చేసి ప్రథమ బహుమతి గెలుపొందింది. బిషప్ ఆఫ్ విజయవాడ మోస్టు రెవరెండ్ డాక్టర్ తెలగతోటి జోసెఫ్ రాజారావు భాగ్యశ్రీకి బంగారు పతకం, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కానూరు కార్మెల్‌మాత పుణ్యక్షేత్రం ఫాదర్ సలివేంద్ర శౌరి సోమవారం భాగ్యశ్రీని ప్రత్యేకంగా అభినందించారు.

రెవెన్యూ సదస్సులో 26 అర్జీలు స్వీకరణ

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో తహసీల్దారు కేవీ శివయ్య పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్వేకు 10, అడంగల్ కరక్షన్ 3, ముటేషన్ 13 అర్జీలను రైతులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రైతులకు మెరుగైన రెవెన్యూ సేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తోందన్నారు. వీఆర్వోలు కేవీ గోపాలరావు, రమ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇరువురికి కంటి చూపు



కంకిపాడు: నేత్రదానంతో ఇరువురికి కంటి చూపు ప్రసాదించడం సాధ్యమవుతుందని సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్ బాబు అన్నారు. పట్టణానికి చెందిన మహదాస్యం రామలక్ష్మమ్మ ఆదివారం రాత్రి మృతిచెందారు. దీంతో కుటుంబ సభ్యుల కోరిక మేరకు లయన్స్‌క్లబ్ సహకారంతో అగర్వాల్ ఆసుపత్రి సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది గ్రామానికి చేరుకుని రామలక్ష్మమ్మ నేత్రాలను సేకరించి భద్రపరిచి ఆసుపత్రికి తరలించారు. నేత్రదానం చేసిన రామలక్ష్మమ్మ కుటుంబ సభ్యుల ఔదార్యాన్ని ఆసుపత్రి వైద్యులు, లయన్స్ ప్రతినిధులు అభినందించారు.

మున్సిపల్ కార్యాలయానికి అద్దె భవనం కావాలి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయానికి అద్దె భవనం కావాలని కమిషనర్ భవానీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయానికి 10 వేల చదరపు అడుగుల విస్తీరణలో ఉన్న భవనం అద్దె ప్రాతిపదికన మూడు సంవత్సరాలకు కావాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలి



ఉయ్యూరు: విద్యార్థులు నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని సైకాలజిస్ట్, న్యూరో-మెంటర్ డాక్టర్ పూజిత పేర్కొన్నారు. కలవపాములలోని శ్రీ జ్యోతి పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు నైపుణ్యాలు, నడవడిక అంశాలపై ఒక రోజు వర్క్‌షాప్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూజిత మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సూరపనేని వెంకట రమణ, ప్రిన్సిపాల్ జన్ను శివకుమార్, ఏఓ పసలపూడి మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఆరోగ్య కేంద్రం

- గత వైఎస్సార్ సీపీ హయాంలో రూ. 1.45 కోట్లు మంజూరు
- చివరిదశలో నిలిచిపోయిన నిర్మాణ పనులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



తుదిదశలో ఆగిపోయిన బాపులపాడు పీహెచ్‌సీ భవన నిర్మాణం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దాదాపు రూ. 1.45 కోట్ల వ్యయంతో ఆరు పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరిన భవనంలో అరకొర మౌలిక సదుపాయాలతో నెట్టుకొస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎట్టకేలకు మోక్షం లభించినట్లు అయింది. దీంతో సకల సదుపాయాలతో నూతన భవన నిర్మాణం చేపట్టారు.

నాడు-నేడులో భాగంగా నిర్మాణం

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని మండల కేంద్రంలోని బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూపురేఖలు సమూలంగా మారుస్తూ పూర్తిస్థాయి సదుపాయాలతో కొత్త భవనం నిర్మించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. పాత పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో వైద్యులు, రోగులు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆపరేషన్ థియేటర్‌లో స్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడి పడిపోవడం, వర్షం నీరు రావడంతో గర్భిణులకు డెలివరీ చేయలేక వైద్యులు పొరుగు ఆసుపత్రికి పంపించేవాళ్లు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2021 ఫిబ్రవరిలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ. 1.45 కోట్ల నిధులు బాపులపాడు పీహెచ్‌సీకి మంజూరు చేసింది. దీంతో నిర్మాణ పనులు ప్రారంభమైయ్యాయి. సువిశాల ప్రాంగణంలో నూతన భవనంలో ఆరు ఇన్ పేషంట్ గదులు, నర్సింగ్ రూం, డెలివరీ రూమ్, ల్యాబ్, ఫార్మసీ, రెండు డాక్టర్ల గదులు, రిసెప్షన్ వంటి సదుపాయాలతో కొత్త భవన నిర్మాణం మొదలు పెట్టారు.

ఇరుకు గదిలోనే పీహెచ్‌సీ సేవలు

రోజుకు దాదాపు 100కు పైగా ఇన్ పేషంట్ సామర్థ్యం కలిగిన ఈ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులు గత కొంత కాలంగా ఆగిపోయాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేసిన నిర్మాణాన్ని ఆ తర్వాత సంబంధిత అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో పూర్తి చేసిన నిర్మాణ పనులకు సైతం బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ కూడా అర్ధాంతరంగా పనులు ఆపేశారు. పాత భవనం కూల్చివేతతో పీహెచ్‌సీని ఆయుష్ హోమియో ఆసుపత్రి బిల్డింగ్‌లోకి తాత్కాలికంగా మార్చారు. దీంతో అప్పటి నుంచి ఆ ఇరుకు గదిలోనే పీహెచ్‌సీ నడుస్తోంది. డాక్టర్లు ఇన్ పేషంట్లకు వైద్య పరీక్షలు చేసేందుకు, ఫార్మసీలోని మందులు భద్రపర్చేందుకు, ల్యాబ్‌లో పరీక్షలు చేయడానికి, రోగులు వేచి ఉండేందుకు ఏలాంటి అవకాశం లేకుండా పోయింది. తాత్కాలిక భవనంలోనే పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది నెట్టుకొస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అసంపూర్తిగా నిలిచిన పీహెచ్‌సీ నిర్మాణం పూర్తి చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి నూతన పీహెచ్‌సీ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ కృషి



బోనస్ చెక్కులు అందజేస్తున్న దాసరి

గన్నవరం: పాడి రైతుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ అన్ని రకాలుగా తోడ్పాటునందిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ దాసరి వెంకటబాలవర్ధనరావు తెలిపారు. స్థానిక విజయ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్‌లో సోమవారం 2024-25 ఏడాదికిగాను గన్నవరం క్లస్టర్ పరిధిలోని 96 పాల సంఘాలకు రెండవ విడత బోనస్ కింద రూ. 67.28 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాసరి మాట్లాడుతూ ఇటీవల బుడమేరు విపత్తు వల్ల యూనియన్‌కు నష్టం వచ్చినప్పటికీ రైతులకు ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పాల సేకరణ ధర లీటరుకు రూ. 2 పెంచడంతో పాటు రెండవ విడత బోనస్ కింద జిల్లాకు రూ. 12.09 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. యూనియన్ అందిస్తున్న ప్రోత్సాహాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. యూనియన్ డైరెక్టర్ పలగాని కొండలరావు, ట్రస్ట్ సభ్యులు జొన్నల హరిరామకోటిరెడ్డి, ఫీడ్ కమిటీ సభ్యుడు కె.శివప్రసాద్, యూనియన్ ఏజీఎం సీహెచ్ అన్వేష్, పలువురు పాల సంఘాల అధ్యక్షులు, రూటు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా శ్రీచైతన్య కళాశాల వార్షికోత్సవం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): శ్రీ చైతన్య ఐఐటీ-డేస్కాలర్స్ (గాయత్రీ, మయూరీ, భాస్కర్‌భవన్) కళాశాల వార్షికోత్సవం కానూరులోని మన కల్యాణ మండపంలో సోమవారం ఉత్సాహంగా జరిగింది. విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) నరేంద్ర ఆనందరావు పాటిల్ హాజరై వేడుకలను ప్రారంభించారు. గత సంవత్సరం ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. చైతన్య విద్యాసంస్థల ఏజీఎం పెనుబాకుల రామకృష్ణ, డీన్ గద్దె ఆంజనేయులు, ఐఐటీ డేస్కాలర్స్ (గాయత్రీ, మయూరీ, భాస్కర్‌భవన్) కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు: కంకిపాడు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. గ్రామాల అభివృద్ధి ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలన్నారు. అవసరం మేరకు అభివృద్ధి పనులను ప్రతిపాదించి లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అన్ని శాఖలూ, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ పి.అనూష, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగంపై సర్కార్ చిన్నచూపు

గన్నవరం: ప్రభుత్వ విద్యారంగంపై కూటమి సర్కార్ చిన్నచూపు చూస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు-నేడు మనబడి ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి పలు పథకాలను అమలు చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ విద్యార్థులకు ఎటువంటి మేలు చేయలేదన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ నిలిపివేయడంతో పాటు అమ్మకు వందనం, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలను అమలు చేయకుండా విద్యార్థులను దగా చేస్తోందన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కూడా సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఈ సమస్యలను పేరెంట్స్, టీచర్స్ సమావేశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ విధానాలతో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పోరంకిలో విద్యార్థి సంఘాల ఆందోళన



పోరంకిలో కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాలు

పెనమలూరు: పోరంకిలోని కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి పట్ల పలు విద్యార్థి సంఘాల నాయకులు కాలేజీ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి మృతికి కాలేజీ యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కాలేజీలు లక్షలాది రూపాయాలు విద్యార్థుల నుంచి దండుకుంటూ పర్యవేక్షణ గాలికి వదిలేస్తున్నారని ఆరోపించారు. హాస్టల్‌లో విద్యార్థులను పర్యవేక్షించకుండా కాలేజీ యాజమాన్యం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. డీన్ పొంతన లేని సమాధానం చెప్పడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. కాలేజీ యజమాని రాష్ట్ర మంత్రికి బినామీగా చలామణి అవుతున్నాడని ఆరోపించారు. కాలేజీ యాజమాన్యంపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘ నేతలు ఎం. సోమేశ్వరరావు, ఎస్. ప్రతాప్‌రెడ్డి, జి. గోపినాయక్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాపులపాడులో సీసీ రోడ్ల నిర్మాణం

హనుమాన్‌జంక్షన్: మండల కేంద్రమైన బాపులపాడులో పలు సీసీరోడ్ల నిర్మాణానికి సోమవారం పనులు చేపట్టారు. గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 76 లక్షలు వ్యయంతో 24 సీసీ రోడ్లను నిర్మించడంతో పాటుగా జెడ్పీ హైస్కూల్ ప్రహరీగోడ నిర్మాణం చేపట్టనున్నట్లుగా పంచాయతీ అధికారులు తెలిపారు.

యువతతోనే మెరుగైన సమాజ స్థాపన



మాట్లాడుతున్న ఇంతియాజ్, వేదికమీద హజరత్తయ్య గుప్తా, గోళ్ల నారాయణరావు

విజయవాడ కల్చరల్: యువత నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్ అన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆంధ్రా లయోలా కళాశాల ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలోని సెమినార్ హాల్లో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'అవినీతి అంతం అదే మన పంతం' అంశంగా కవి సమ్మేళనం, సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ మెరుగైన సమాజస్థాపన యువతతోనే సాధ్యమన్నారు. యువత సమాజంలో నైతిక విలువలు పెంపు కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అవినీతి లేని సమాజం యువత భవితకు సోపానన్నారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ నేడు సమాజంలో అవినీతి వేయి శిరస్సుల కాల నాగులా విజృంభిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నైతిక విలువలకు కట్టుబడి ఉంటామని యువత చేత ప్రతిజ్ఞ చేయించారు. లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జీ.కిరణ్ కుమార్ మాట్లాడుతూ 70 సంవత్సరాల క్రితం ఇదే రోజు లయోలా కళాశాల స్థాపనకు బీజం పడిందని తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్‌కు బాటలు వేసుకున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో కళాపోషకుడు గోళ్ల నారాయణరావు, గాంధీ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ గాంధీ నాగరాజు, డాక్టర్ సమరం తదితరులు అవినీతి రహిత భారతం యువత కర్తవ్యం అంశంగా ప్రసంగించారు. పినాకినీ ఫెల్‌ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కె.మురళీ మోహన్‌రాజు, కళాశాల తెలుగు సంస్కృత శాఖాధిపతి డాక్టర్ కె.శేఖర్, కళాశాల అధ్యాపకుడు డాక్టర్ రవీంద్రబాబు పాల్గొన్నారు. మహిళలు అవినీతి అంతం ఇదే మనపంతం అంశంగా స్వీయ కవితాగానం చేశారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పెనమలూరు: పోరంకి గ్రామంలో రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేశారు. గ్రామంలోని టెలిఫోన్ కాలనీకి చెందిన ప్రాంతంలో రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి మంజూరైన తాడిగడప మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్ రూ. 40 లక్షలు నిధులతో పనులు చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల వివరాలు తెలపాలి



ఉంగుటూరు: గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల వివరాలను తెలపాలని సీపీఎం నాయకులు తహసీల్దారుకు అర్జీ అందజేశారు. తేలప్రోలు గ్రామ సచివాలయాలు-1, 2 పరిధిలో సోమవారం రెవెన్యూ సదస్సు పంచాయితీ కార్యాలయ ఆవరణలో జరిగింది. దళితవాడలో శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. తేలప్రోలు-నందమూరు ఆర్ అండ్‌బీ రహదారి పక్కన ఉన్న ఐటీఐ సమీపంలో డంపింగ్ యార్డు తరహాలో చెత్త వేయడం వల్ల విద్యార్థులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని అర్జీలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విమలకుమారి మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి శ్మశానవాటిక, డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, మండల కమిటీ సభ్యుడు మాగంటి సాంబశివరావు, సీనియర్ నాయకులు భీమవరపు సుబ్బారెడ్డి, జంపన జోజి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

పెనమలూరు: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నలుగురు విద్యార్థులు సత్తాచాటారు. ఈ మేరకు యనమలకుదురుకు చెందిన వన్కన్ కరాటే ఫెడరేషన్ కోచ్ ఎస్ దుర్గారావు సోమవారం వివరాలు తెలిపారు. ఈ నెల 8వ తేదీన జాతీయ స్థాయి కరాటే పోటీలు గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో మొత్తం 500 మంది పాల్గొన్నారని చెప్పారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 6 సంవత్సరాల విభాగంలో జి.నైనా ఎల్లో బెల్టు విభాగంలో బంగారు పతకం, ఎం.చరణి వైట్ బెల్టులో రజత పతకం సాధించారన్నారు. అలాగే 8 సంవత్సరాల విభాగంలో ఆరెంజ్ బెల్టులో ఎం.దక్ష రజత పతకం, 10 సంవత్సరాల విభాగంలో వైట్ బెల్టులో ఆర్.జాయ్‌తన్విత్ రజత పతకం సాధించారని పేర్కొన్నారు.

ఉయ్యూరు: కరాటే చాంపియన్ షిప్‌లో ఉయ్యూరు ఎంకే ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. విద్యాసంస్థల డైరెక్టర్ ఎంకే బాబు సోమవారం మాట్లాడుతూ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో ఎనిమిది మంది బంగారు, నలుగురు రజతం, తొమ్మిది మంది కాంస్య పతకాలు సాధించారన్నారు. విజేతలను, శిక్షణ ఇచ్చిన కరాటే కోచ్ రామకృష్ణను ఆయన అభినందించారు.

గన్నవరం: జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో గన్నవరం ప్రాంత విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు కోచ్ యు. వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో విజేతలైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ.. ఈ నెల 8న చిలకలూరుపేటలో జరిగిన పోటీల్లో గన్నవరం విద్యార్థులు ఎం. రామ్‌తేజ, ఎ. చర్సీ, జె. వేదాశ్రీ, కె. సలోమి, సువర్ణ, పి. సంజన, జె. లోకేష్, ఎం. మోహిత్‌లో అండర్-12 విభాగంలో బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. అండర్-14 విభాగంలో కె. హేమంత్, కె. శ్రేయస్, టి. మనోరంజిత్, వి. పార్థు, కె. సిద్దు, జె. సాయిరోషన్, ఆర్. దుర్గ, కె. పర్ణికలు బంగారు పతకాలు గెలుచుకున్నట్లు చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, పలువురు వాకర్స్ అభినందించారు.



పతకాలతో ఎంకే హైస్కూల్ విద్యార్థులు



పతకాలు సాధించిన గన్నవరం విద్యార్థులు

మాల మహాగర్జనను విజయవంతం చేయండి



మహాగర్జన పోస్టర్ ఆవిష్కరిస్తున్న దేవీప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు, నాయకులు

గన్నవరం: సుప్రీంకోర్టు ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్ తీర్పును రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 15న గుంటూరులోని నల్లపాడు రోడ్డులో జరగనున్న మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవీప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని కేసరపల్లి అంబేడ్కర్‌నగర్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహాగర్జనకు లక్షలాదిగా మాలలు తరలిరావాలని కోరారు. అనంతరం మహాగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. మాల మహానాడు రాష్ట్ర నాయకుడు మెండెం రాంబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, నున్న మాజీ సర్పంచి కర్రి విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పొంగులేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు

విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఈఈ కె.వెంకటేశ్వర్లు



కంకిపాడులో విద్యుత్ మీటరును తనిఖీ చేస్తున్న అధికారులు

కంకిపాడు: విద్యుత్ అక్రమ వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఈఈ కె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 46 ప్రత్యేక బృందాలు సోమవారం విద్యుత్ మీటర్లను విస్తృతంగా తనిఖీ చేశాయి. తొలుత పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. విజిలెన్స్ విభాగం ఈఈ కె.వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఈఈ పి.హరిబాబు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అదనపు లోడు వినియోగించినా, అక్రమ విద్యుత్ వినియోగానికి పాల్పడినా శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. తనిఖీల్లో భాగంగా అదనపు విద్యుత్ వినియోగానికి సంబంధించి 165 కేసులు నమోదు చేసి రూ. 5.70 లక్షలు జరిమానా విధించారు. తనిఖీలను కానూరు డీఈఈ బి. నవీన్‌కుమార్, ఏఈ తాళ్లూరి అశోక్‌కుమార్ పర్యవేక్షించారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



మంతెన సదస్సులో సమస్యలను వింటున్న తహసీల్దార్ వి.భావనారాయణ

కంకిపాడు: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వి. భావనారాయణ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంతెన గ్రామ సచివాలయం వద్ద సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలోని వివిధ భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి 11 అర్జీలను గ్రామస్థులు సదస్సులో అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భావనారాయణ మాట్లాడుతూ రెవెన్యూ సేవలను సమర్థంగా అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలు సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సోమవారం గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన శ్రీ ఉమా మహేశ్వర కళాక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నాటాచార్య కంచికట్టు వాసుదేవరావు పర్యవేక్షణలో బిందు యోషిత, హర్షిణి, సుప్రియరెడ్డి, చైత్రిక, గీతిక, హర్షిణిలు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించారు. వాసుదేవరావుతో పాటు చిన్నారులకు ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందించి అభినందించారు.